డేడి,

నా మిత్రులతో పార్టీ చేసుకోడానికి నేనో బాటిల్‌ని తీసుకు వెళ్తున్నాను. నీకు కోపం రాదనుకుంటున్నాను.

నీతి: ఎవరి పాపం వారినే కాల్చేస్తుంది కాబట్టి మనం చేసే పనులని పాపరహితంగా ఉంచుకోవడం మన మంచికే.

## 144. దైవ రక్షణ

రెండో ప్రపంచ యుద్ధ కాలంలో బ్రిటీష్ సైన్యంలో పనిచేసిన జాన్, జార్జ్ అనే ఇద్దరు మిత్రులు బ్రిటన్‌లోని బోల్టన్ అనే ఓ ఊరికి చెందినవారు. జాన్‌కి దైవభక్తి ఎక్కువ. దాంతో మెళ్ళో క్రాస్‌ని వేసుకునేవాడు. జేబులో కూడా ఓ క్రాస్‌ని ఉంచుకుని, మణికట్టుకి ఒకటి కట్టుకునేవాడు.

జార్జ్‌కి దైవ భక్తి లేదు. తన మిత్రుడు జాన్ ఒంటి మీదవి చూసి అతనిది మూఢభక్తి అని నవ్వుకునేవాడు. ఓ సారి జర్మన్స్ మీద డన్‌కిర్క్ అనే చోట ఇద్దరి ప్లెటూన్స్ కలిసి యుద్ధంలో పాల్గొన్నాయి. తమ దగ్గర పేలిన ఓ హేండ్ గ్రనేడ్ ముక్క వచ్చి గుండె లోకి దిగబడి జార్జ్ మరణించాడు. కాని జాన్ మాత్రం ఆ దాడిలో బ్రతికి బయటపడ్డాడు.

గ్రెనేడ్ తునక వచ్చి జాన్‌కి కూడా ఛాతీకి తాకింది కాని, అతని మెడకి వేలాడే లోహంతో చేసిన క్రాస్ అది లోపలకి వెళ్ళకుండా అడ్డుపడింది. ఆ శిలువే అతన్ని కాపాడింది.

## 145. నేర్చుకో

పూర్వం కాశీకి వెళ్ళే దారిలో నర్మదా నదీ తీరంలో ఓ చోట పెద్ద ఎత్తున కట్టె పుల్లలు అనేకం పేర్చి ఉండటం అనేకమంది బాటసారులు చూసేవారు. వాటిని దగ్గరే ఉన్న అడవి లోంచి ఏరి తెచ్చే ఓ ముసలతను కనిపించేవాడు. అంతా ఆయన్ని ఆసక్తిగా అడిగేవారు.

"ఏం తాతా! ఎందుకు ఇన్ని కట్టె పుల్లలు పోగుచేస్తున్నావు?"

"నేను ఎప్పుడైనా నర్మదా నది దాటి కాశీకి వెళ్ళాలనుకున్నప్పుడు వంతెనని కట్టుకోడానికి." జవాబు చెప్పేవాడతను.

వారా సమాధానానికి పక పకా నవ్వితే ఆయనా అలాగే నవ్వేవాడు.

"నన్ను చూసి ఎందుకలా నవ్వావు?" అని వారు అడగకుండా ఉండలేకపోయేవారు.

అప్పుడు ఆయన చెప్పే సమాధానం ఇది.

"మీరు ఖర్చు చేయలేనంత ధనాన్ని, ఎప్పటికైనా ఖర్చుకి పనికి వస్తుందని ఎలా పోగుచేసుకుంటున్నారో, నేనూ అలాగే ఎన్నడూ కట్టని వంతెన కోసం కట్టె పుల్లలని పోగుచేసుకుంటున్నాను." పాఠం నేర్పించాడు అతను.

## 146. మతాన్ని గౌరవించడం ఎలా?

ఓ భారతీయ సాధువుని జర్మనీకి ఆహ్వానించారు. బెర్లిన్‌లోని ఓ పెద్ద చర్చిలో అతను తన ప్రవచనాన్ని మొదలెట్టబోయే ముందు ఒకరు ఓ చీటి మీద తన అనుమానాన్ని రాసి పంపించాడు. దాన్ని బయటకి బిగ్గరగా చదివాడు ఆ సాధువు.

"భారత దేశంలోని హిందూమతం అహింసా తత్త్వాన్ని బోధిస్తోంది కదా. మరి అక్కడ పుట్టిన గాంధి దాన్ని బాగా ఆకళింపు చేసుకుని దాన్ని అనుసరిస్తే, అక్కడే పుట్టిన గాడ్సే గాంధీని ఎందుకు హత్య చేసాడు?"

కొద్దిసేపు మౌనంగా ఉన్నాక ఆ సాధువు ఆ ప్రశ్నకి ఇలా జవాబు చెప్పాడు.

"నేను ఓ రోజు భారత దేశంలోని ఋషికేష్‌లోని మా ఆశ్రమంలోంచి గంగానది ఒడ్డుకి వెళ్ళి కొద్దిసేపు అక్కడ కూర్చున్నాను. తర్వాత నదిలోకి